# మధ్య వయసు మహిళలే టార్గెట్



మోసానికి వినియోగించే నోట్ల బండిల్‌తోపాటు స్వాధీనం చేసుకున్న నగలను చూపుతున్న సీపీ సుధీర్‌బాబు

- మాటలు కలిపి, మభ్యపెట్టి.. మత్తు మందు కలిపి నీళ్లు ఇచ్చి..
- ఆభరణాలు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్ట్
- ఏడు కేసుల్లో కాజేసిన రూ.17లక్షల విలువైన బంగారు నగలు స్వాధీనం

హైదరాబాద్ సిటీ, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మాటలు కలిపి, డబ్బులు చూపి మభ్యపెట్టి తర్వాత మత్తు మందు కలిపిన నీళ్లు తాగించి, బంగారు నగలను కాజేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను భువనగిరి పోలీసులు అరెస్ట్ చేశారు. దృష్టి మళ్లించి మోసాలు చేస్తున్న ముఠాలోని కీలక సూత్రధారి గుజరాతీ కిషన్(24) నగరానికి వచ్చి తెలుగు నేర్చుకున్నాడని, బాలుడితోపాటు ఢిల్లీకి చెందిన ముఠా సభ్యులతో కలిసి మోసాలకు పాల్పడుతున్నాడని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అన్నారు. నేరేడ్‌మెట్‌లోని కమిషనర్ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాదాద్రి డీసీపీ రాజేష్‌చంద్రతో కలిసి కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బాధితులు కూడా అత్యాశకు పోవడంతో మోసగాళ్ల పని సులభం అవుతుందని, వీరిని ఏమార్చేందుకు ముఠా సభ్యులు మత్తు మందులు వినియోగిస్తున్నారని తెలిపారు. ముఠాలోని మోసగాళ్లపై ఢిల్లీలో ఇదే తరహా మోసం కేసులున్నాయని, వీరు మధ్య వయసులో ఉన్న మహిళలనే టార్గెట్ చేస్తున్నారని తెలిపారు. గుజరాత్ అహ్మదాబాద్‌కు చెందిన గుజరాతి కిషన్(24) కొంతకాలం క్రితం నగరానికి వచ్చి, ప్లాస్టిక్ పువ్వుల విక్రయం చేస్తున్నాడు. ఢిల్లీలో పలు నేరాలు చేసిన ఇతడు దృష్టి మళ్లించి చోరీలు చేసేందుకు తెలుగు నేర్చుకున్నాడు. మరో బాలుడు, ఢిల్లీ బేగంపూర్‌కు చెందిన ప్లాస్టిక్ పూల వ్యాపారులు రామ్‌లాల్(42) శ్యాంలాల్(30), కోలి(50), గుల్షన్ అలియాస్ గుల్లు(26), దీపక్(28)లతో ముఠాను తయారు చేశాడు. రూ. 500నోట్లు పైన రెండు కింద రెండు పెట్టి మధ్యలో కాగితాలతో నోట్ల కట్టలను తయారు చేస్తారు. బాలుడి వద్ద నోట్లకట్టలు చూపుతూ మోసాలు చేస్తారు. ఈ ముఠా సభ్యులు నగరంలో అఫ్జల్‌గంజ్, దుండిగల్, ఎస్ఆర్‌నగర్, జీడిమెట్ల, హుస్సేనిఆలం, భువనగిరి పోలీస్‌స్టేషన్ల పరిధిలో మోసాలు చేసి, మహిళల బంగారు పుస్తెల తాళ్లు కాజేశారు.

## ఒంటరిగా ఉన్న మహిళ..

ముఠా సభ్యులు నగరంలో సంచరిస్తూ ఒంటరిగా ఉన్న మధ్య వయసు మహిళను టార్గెట్ చేస్తారు. వారి వద్దకు మైనర్ బాలుడిని పంపుతారు. చేతిలో నోట్ల కట్టలతో ఉన్న కవర్‌ను పట్టుకున్న బాలుడు టార్గెట్ చేసిన మహిళ వద్దకు వెళ్లి తన వద్ద ఉన్న కవర్‌ను కొరియర్ ద్వారా పంపాలని అడ్రస్ అడుగుతాడు. ఇదే సమయంలో అటుగా వచ్చిన ముఠా సభ్యులు మహిళతో మాట కలుపుతారు. బాలుడి వద్ద ఉన్న కవర్‌ను కొద్దిగా చించిన ముఠాలోని సభ్యుడు అందులో డబ్బు ఉన్నట్లు చూపుతాడు. మాటలు కలిపి నోట్ల కవర్‌ను ఆమె వద్ద ఉంచుతారు. నమ్మకం కలిగేందుకు డబ్బులకు బదులుగా పుస్తెలతాడు ఇవ్వాలని చెబుతారు. ఈ సమయంలో మాటల మధ్యలో మహిళకు మత్తు ముందు కలిపిన నీళ్లను మహిళతో తాగిస్తారు. ఆమె మత్తులోకి జారుకున్న వెంటనే నగలు, నగదుతో ఉడాయిస్తారు.

## పట్టించిన సీసీ ఫుటేజ్..

నగరంలో వరుసగా దృష్టి మళ్లింపు మోసాల కేసులు వెలుగులోకి రావడంతో రాచకొండ పోలీసులు రంగంలోకి దిగారు. ముఠా సభ్యులు జవహర్‌నగర్‌లో ఓ ఇంటిని అద్దెకు తీసుకొని, నగరంలో పలు ప్రాంతాల్లో తిరుగుతూ మోసాలు చేస్తున్నారు. సీసీ ఫుటేజ్‌లు పరిశీలించిన పోలీసులు ముఠా సభ్యులు జవహర్‌నగర్ నుంచి రాకపోకలు చేస్తున్నట్లు గుర్తించారు. జవహర్‌నగర్‌లో ముఠా సభ్యులు ఉన్న ఇంటిపై దాడిచేసిన పోలీసులు ప్రధాన నిందితుడు గుజరాతి కిషన్‌తోపాటు రామ్‌లాల్, శ్యాంలాల్, కోలితోపాటు బాలుడిని అరెస్ట్ చేశారు. వారి నుంచి ఏడు కేసుల్లో కాజేసిన రూ.17లక్షల విలువైన 7బంగారు పుస్తెల తాళ్లతోపాటు మత్తును కలిగించే అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకున్న భువనగిరి అధికారులను, సిబ్బందిని సీపీ సుధీర్‌బాబు అభినందించారు.త

# చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ముఠా అరెస్టు

## రాచకొండ సీపీ సుధీర్‌బాబు

సిటీబ్యూరో, జనవరి 29(నమస్తే తెలంగాణ): దృష్టి మళ్లించి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను యాద్రిది భువనగిరి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.17 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. గురువారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కమిషనర్ సుధీర్‌బాబు వివరాలు వెల్లడించారు. భువనగిరి బస్‌స్టేషన్‌లో ఈ నెల 21వ తేదీన ఓ మహిళ దృష్టి మళ్లించి ఆమె మెడలో ఉన్న బంగారు చైన్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దోపిడీ చేశారనే ఫిర్యాదుపై భువనగిరి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో ఈ దొంగల ముఠాపైనా కింద అసలు నోట్లు పెట్టి మధ్యలో కాగితాలతో నోట్ల కట్టలను తయారు చేసి వాటిని అసలు నోట్లుగా నమ్మించే ప్రయత్నం చేస్తారు. మహిళలను మభ్యపెట్టి ఈ నోట్లను చూపిస్తుండగా, మరో గ్యాంగ్ వచ్చి మరో విధంగా మాట్లాడి బాధితులపై వివిధ రకాల ఒత్తిడి పెంచి వారి దృష్టి మళ్లించి వారి వద్ద ఉన్న సొమ్మును దొంగిలించి పరారవుతుంటారు. పోలీసులు ఇదంతా అంతర్రాష్ట్ర ముఠా పని అని భావించి ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు.


స్వాధీనం చేసుకున్న ఆభరణాలను చూపిస్తున్న రాచకొండ సీపీ సుధీర్‌బాబు

## అంతర్రాష్ట్ర ముఠా...

నగర శివారులో గుండ్లపోచంపల్లిలో గుజరాత్ రాష్ట్రానికి చెందిన గుజారాతి కిషన్ ప్లాస్టిక్ ఫ్లవర్ బిజినెస్ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అతడు అదే వ్యాపారం నిర్వహించే ఢిల్లీకి చెందిన రామ్‌లాల్, శ్యామ్‌లాల్, కోలీ, మరో జ్యువెనల్‌లతో పాటు గుల్షన అలియాస్ గుల్ల, దీపక్‌లతో కలిసి ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. ఈ ముఠా బాధితుల వద్దకు వెళ్లినప్పుడు రెండుగా విడిపోతుంది. గుల్షన్, దీపక్‌లు పరారీలో ఉండగా.. మిగతా నిందితులు పోలీసులకు పట్టుబడ్డారు. వారిని విచారించడంతో భువనగిరిలో నమోదైన కేసుతో పాటు సైబరాబాద్, హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలోనూ మరో ఏడు నేరాలు చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో నిందితులను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి 7 బంగారు గొలుసులు 232.75 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో భువనగిరి డీసీపీ రాజేశ్ చంద్ర, భువనగిరి ఏసీపీ రాహుల్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.